


## ఎక్కువ కులజుడైన

# అన్నమయ్య పదాలు సామాజిక దృక్పథాలు

ప్రతీరోజూ మన ముందు అనేక సంఘటనలు జరుగుతాయి. మంచివి కావచ్చు . చెడ్డవి కావచ్చు. సంఘటన బట్టి విషయాన్ని బట్టి ఎవరికి తోచిన రీతిలో వారు స్పందించడం మానవ సహజం. మంచి జరిగితే ఆనందం కలుగుతుంది. చెడు జరిగితే బాధ కలుగుతుంది. బాధ సన్నిహితులదైతే మరింత ఎక్కువగా ఉంటుంది. మిగతావారి విషయంలో ఓ నిట్టూర్పుతో సరిపెట్టేసుకుంటాం. ఒక్కో సారి మన కళ్ళముందే అన్యాయం జరుగుతున్నా తప్పని అనలేకపోవచ్చు. మనకెందుకులే తలదించుకొని వెళిపోవడం రోజూ చూస్తూనే ఉంటాం. సామాన్యుల ప్రవర్తనా సరళి ఇలా ఉంటుంది. కానీ కవుల విషయం లో అలా కాదు.

లోతైన భావజాలమే కాదు, కవి హృదయం అతి సున్నితంగా ఉంటుంది. ఒక్కోసారి వజ్రమంత కఠినంగా స్పందనావేశం హృదయాలను తాకుతుంది. ప్రజలలో చైతన్యాన్ని కలగ జేస్తుంది. విప్లవ భావాలకి అంకురార్పణ జేస్తుంది. ఏ విషయానికైనా సాధారణ ప్రజలకి కలిగే స్పందన కవి హృదయంలో కాస్త ముందుగా ప్రవహిస్తుంది. ప్రవాహానికి వాక్కు వాయువులా తోడైతే వచ్చేది విప్లవ ప్రళయమే! ప్రళయం యొక్క ధాటి ఆయా స్పందనల బట్టి ఉంటుంది. మనముందు మంచి జరిగితే మెచ్చుకోవడానికి ఎంత పెద్ద మనసు కావాలో మన ముందు చెడు కానీ, అన్యాయం కానీ జరిగితే ఖండిచడానికి వెయ్యి రెట్లు ధైర్యం కావాలి. అప్పుడే కవనం విప్లవ జ్వాలలా చరిత్రలో వెలుగుతూ ఉంటుంది. ఆ వెలుగులో నిజమైన కవి అజరామరంగా ప్రకాశిస్తూ ఉంటాడు. ఒక చేత్తో శంఖం, రెండో చేతిలో చక్రం ధరించిన శ్రీ మహావిష్ణు అవతారంలా ఒక పక్క భక్తి భావంతో , రెండో వైపు విప్లవ భావాలతో శంఖ చక్ర ధారి అయిన శ్రీ మహావిష్ణువు అవతారంలా సొబగులందించిన సాహితీ స్థితికారుడు అన్నమయ్య. విప్లవ పదాలతో జన జాగృతిని కలిగించిన మొట్టమొదటి వాగ్గేయకారుడు అన్నమయ్య. తనముందు జరిగిన చెడునీ, అన్యాయాన్నీ ఎన్నడూ సహించలేదు. ప్రజలకీ, ప్రభువులకీ వెరవ లేదు. తప్పుని ఖండిచాడు. అన్యాయాన్ని గొంతెత్తి చాటి చెప్పాడు. అన్యాయం ఏదైనా కావచ్చు, మోసగించడం కానీ, చంపడంకానీ, సాటి వారిపై వివక్షత కానీ, దూషణ కానీ, నిర్భీతిగా నిర్మొహమాటంగా ఎలుగెత్తి చాటిన పద కవితా పితామహుడు అన్నమయ్య. తోటి మనిషిపై వివక్షత చూపుతూ కులాల పేరుతో మనుషుల్ని వేరుచేసే అరాచక వ్యవస్థని ప్రశ్నించిన మొట్టమొదటి విప్లవ కవిగా అన్నమయ్య పేరు చెప్పుకోవచ్చు. కులాన్ని బట్టి, పుట్టుకని బట్టీ కాకుండా, కేవలం సద్గుణ ప్రవర్తన తోనే ఏ వ్యక్తి అయినా గొప్పవాడు అవుతాడని పదిమందికీ చాటి చెప్పాడు. తను అన్నదే అనుసరించాడు. కేవలం కుల వ్యవస్థని ఖండిస్తూ అనేక కీర్తనలు రాసాడు. బహుళ ప్రాచుర్యం పొందిన "తందనానా ఓరే తందనానా భళా" కాకుండా పలు కీర్తనలు విరచించాడు.

పల్లవి: ఎక్కువ కులజుడైన హీన కులజుడైన
నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడు.

చరణం: వేదములు చదివియును విముఖుడై హరిభక్తి
యాదరించిన సోమయాజి కంటె
యేదియునులేని కులహీనుడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుడే ఘనుడు.

చరణం: పరమగు వేదాంతపఠన దొరికియు సదా
హరిభక్తి లేని సన్యాసి కంటె
సరవి మాలిన యంత్యజాతి కులజుడైన
నరసి విష్ణుని వెదకునాతడే ఘనుడు

చరణం: వినియు చదివియును శ్రీవిభుని దాసుడుగాక
తనువు వేపుచునుండు తపసి కంటె
ఎనలేని తిరువేంకటేశు ప్రాసాదాన్న
ననుభవించిన యాతడప్పుడే ఘనుడు.

నిక్కమైన దైవ సాన్నిధ్యం పొందడానికి కావల్సింది కులం కాదు, నిర్మలమైన భక్తి అంటూ చాటి చెప్పాడు. అలాగే తందనానా ఒరే కీర్తనలో నిండారా రాజు నిద్రించు నిద్రయూ ఒకటే, అండనే బంటునిద్ర అదియూ నొకటే, మెండైన బ్రాహ్మణుడూ మెట్టు భూమి ఒకటే, చండాలుడుండేటి సరి భూమి ఒకటే, అంటూ, కులమనే మలినం మనుషులకి కానీ భూమికి కాదు, రాజుకీ, సేవకుడికీ నిద్ర ఒకటే, శరీరమూ ఒకటే అయినప్పుడు అంటరాని ఈ కులాలెందుకంటూ గొంతెత్తి పాడాడు. అలాగే ఇంకో కీర్తనలో హరివిజ్ఞాన దాస్యం ఒక్కటే సుజాతి అని స్పష్టంగా విశదీకరించాడు.

విజాతులన్నియు వృధా వృధా
అజామిళాదులకదియే జాతి

చరణం: జాతి భేదములు శరీర గుణములు
జాతి శరీరము సరి దోడనె చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును అది నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపుదాస్యం బిది యొక్కటె పో సుజాతి

చరణం: హరి ఇందరిలో నంతరాత్ముడిదె
ధరణి జాతిభేదములెంచిన
పరమగు లీ భావ మష్టమదము భవవికారమని మానిరి
ధరణిలోన బరతత్వ జ్ఞానము ధర్మమూలమే సుజాతి

కులభేదాలు, అంటరాని తనం అన్నమయ్య కాలంలో ఎక్కువగానే ఉండేవి. శరీర శుభ్రత ఒక్కటే కాదు, మనస్సు కూడా పరిశుభ్రంగా ఉన్న జాతే సుజాతి. అందరిలోనూ హరి అంతరాత్ముడై ఉన్నాడు. అటువంటప్పుడు అంటరాని వాడంటూ ఎవరూ ఉండరన్న ధర్మ సూత్రాన్ని అతి సున్నితంగా చెప్పాడు. అప్పటి రోజుల్లో ప్రభువులనీ, అధికారులనీ ప్రశ్నించేవారే లేరు. భయంతో నోరు విప్పే వారు కాదు. అలాగే అంటరాని తనం పేరుతో దైవ సాన్నిధ్యానికి దూరంగా ఉంచేవారు. వారుచేసే పని తప్పు అని ఖండించగలవాడే అసలైన ధైర్యశాలి. తనకేమైనా పరవాలేదు, కానీ మన మధ్యలో చెడుని ఖండిచాలన్న ధోరణే విప్లం అంటే! మన శరీరంలో ముల్లు గుచ్చుకుంటే, బాధతో అరుస్తూ ముల్లుని తీసేస్తాం. అలాగే మన మధ్య జరిగే అన్యాయపు ముల్లునీ మాటల ఆయుధంతో పెకలించాలి. అందుకే ప్రతీ కవికీ స్పందనే ఒకటే చాలదు, కవనపు కత్తితో అన్యాయాన్ని వేటు వేసే సాహసమూ కావాలి. ఈ విషయంలో కవులందరికీ అన్నమయ్యే ఆది గురువు.. ప్రతీరోజు అన్నమయ్య కీర్తనలు పాడడమే కాకుండా ఆ మహానుభావుడు వెలిగించిన విప్లవ జ్యోతులు ఆరిపోకుండా నడుచుకోవాలి. ఏ కవికైనా హృదయమూ, స్పందనే కాదు, తన కవనానికి గొంతు విప్పే ధైర్యం కూడా ఉండాలి. అప్పుడే ఆ కవి అజరామరుడై వెలుగొందుతాడు.

సాయిబ్రహ్మానందంగారు అమలాపురంలో అక్షరాభ్యాసం !
ఆర్జన కోసం అమెరికాలోనివాసం!"పంచమ ధర్మం" పద్యనాటకం
౨౦౦౬ నంది నాటక పోటీల్లో ప్రదర్శింపబడడం ప్రవాసాంధ్రుడిగా
సంతోషం! తెలుగు యూనివర్సిటీ పద్యనాటక విభాగంలో పాఠ్యాంశంగా
పంచమధర్మం నాటకం చేర్చడం మరింత సంతోషం!"మన భూమి" మాస పత్రికలో
ప్రవాసం.కా(లె ం అనే శీర్షిక రాస్తున్నారు. రాసిన నాటకాలు అనేక చోట్ల
ప్రదర్శింపబడ్డాయి, కథలు అనేక ప్రముఖ పత్రికలో ప్రచురించబడ్డాయి.

## ఇలా అన్నారు

*ఆ నాటికీ, ఈ నాటికీ, ఏ నాటికీ మనుషులు గుర్తించనిదేమిటంటే - గొప్ప పాపాలకన్నా పాపాలుగా కనబడని నీచత్వాలు,Meanness, కపటం, మోసం, స్వార్ధం, అబద్ధం, అసహనం, గర్వం, ఇవే కాంతిని చూడనీయని ముఖ్యమైన అభ్యంతరాలు. తాము పుణ్యాత్ములమనే జ్ఞానం గొప్ప తెర అభివృద్ధికి!*

*నిర్వికల్పం లో చలం ( రచనా కాలం: 1962)*